# కృతఘ్నుడు

## 1

బంగారయ్యకు పొలం దున్నుకుంటుంటే – విలువైన వజ్రం ఒకటి దొరికింది. దాన్ని చూసి తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు బంగారయ్య. దాన్ని చేతిలోకి తీసుకుని మన్నంతా తుడిచాడు. అది ధగాధగా మెరుస్తోంటే అతని గుండెలు దడ దడ లాడాయి. ఎప్పుడూ కలగని భయమూ, సందేహమూ కలిగాయి. చేతులు వణికాయి. ఒళ్ళంతా చెమటలు పట్టింది. అతని మెదడు – దిమ్మెరపోయినట్లు స్తంభించిపోయింది. వణుకుతున్న చేతులతో ఆ వజ్రాన్ని తన మొలలో బిగించాడు.



బంగారయ్యలాంటి పేదవాడికి అటువంటి వజ్రం దొరికితే – అతని మనసులో చెలరేగే తుఫానును మనం వూహించుకోలేం....త్వరగా పని పూర్తి చేసి ఎడ్లను ఇంటికి మళ్ళించాడు బంగారయ్య. అతని కాళ్ళు తడబడ సాగాయి....ఏదో చెప్పరాని ఆనందం...దాని వెనుకనే భయం! ఎవరైనా చూసివుంటే తనకు ఏం ప్రమాదం కలుగుతుందో నన్న సందేహం. ఆసందేహం వల్లనే అతని కాళ్ళు చాలా వేగంగా నడిచాయి–ఇంటి వైపుకి.

భర్త ద్వారా యీసంగతి యావత్తూ విన్న సీతమ్మ సంతోషంతో వుబ్బాంగిపోయింది. ఈనాటికి తమపై చల్లని చూపు చూసిన "చల్లని తండ్రి రామయ్య"కు మాటిమాటికీ చేతులెత్తి నమస్కారాలు చేసింది. వాళ్ళ జీవితంలో ఆనాటికి వాళ్ళ ముఖాలు పున్నమినాటి కలువల్లాగా కల కల లాడినై. తీయ తీయని కథలు చెప్పి జోకొట్టే అమ్మమ్మలుగా ఆ దంపతు లిద్దర్నీ ఆనాటి రేయి మధుర స్వప్నాలలో ముంచెత్తింది.

ఆ రాత్రంతా తనకు దొరికిన వజ్రాన్ని గురించి ఆలోచించసాగాడు బంగారయ్య. ఛటుక్కున అతనికొక చక్కని ఆలోచన కలిగింది.

ఆ దేశపు మహారాజుగారు దేశంలో ఎవరూ కని విని ఎరుగనట్టి "విచిత్ర" వస్తు ప్రదర్శనశాల నొకదాన్ని క్రొత్తగా నిర్మించిన విషయం ప్రజల కందరికీ తెలిసిందే. ఎవరి దగ్గరైనా చిత్ర విచిత్ర వస్తువులుగాని, అమూల్య వస్తువులు గాని వుంటే చిత్ర వస్తు ప్రదర్శనశాల కందజేయవలసినదిగా కోరుతూ చాటింపు కూడా వేయబడింది.

అలా చేస్తే వస్తువు యొక్క మూల్యమే గాక వస్తువు యోగ్యతనుబట్టి బహుమతి కూడా లభిస్తుంది.

ఈ విషయం జ్ఞాపకానికి రాగానే బంగారయ్య మనస్సు సంతోషంతో నిండిపోయింది. అతని వజ్రం అమూల్యమైందే గాక అద్వితీయమైంది కూడా. తప్పకుండా అది అతనికి సంపదను తెచ్చిపెడుతుంది. అందులో సందేహం లేదు. తానిక రాజధానీ నగరానికి ప్రయాణం కావడమే తరువాయి.

భార్యకీ విషయం చెప్పి—మరునాటి ఉదయమే ప్రయాణం కావాలనుకున్నాడు బంగారయ్య.

# 2



దినకరుడు తన పలుచటి కిరణాలను భువిపైకి ప్రస రింపజేస్తూ పడమటి కొండల వెనుకకు జారుకుంటున్నాడు. సంధ్యాసుందరి తన ముగ్ధ మోహన లావణ్యాన్ని ప్రకృతి సౌందర్యంతో మేళవింపజేసి హృదయ రంజకంగా నాట్యం చేస్తోంది.

వినీలాంబరంలో పరుగులెత్తే పక్షుల రక రకాల కూతలు చెవులకు మోత పెడుతున్నాయి. రివ్వుమంటూ వీస్తోంది చల్లని గాలి.

అస్తమయ సూర్యుని లేలేత కిరణాలలో ఆ అడవి లోని చెట్ల కొసలు పచ్చగా మిల మిలలాడి పోతున్నాయి.

సాయంసమయపు పొడవైన తరుచ్ఛాయల్లో రాజధానీ నగరం వైపుగా గబగబ సాగిపోతున్నాడు బంగారయ్య. చీకట్లు క్రమ్ముకుంటున్న కొద్దీ అతనికి ఆతురత, ఆరాటం ఎక్కువౌతోంది. ఆదుర్దా ఎక్కువౌతున్నకొదీ అతని నడక వేగాన్నందుకుంటోంది.

క్రమంగా పగలంతరించి అంధకారపు తెరలు ఆవరించినై. అంతవరకు నిర్మలంగావున్న ఆకాశం ప్రత్తి వుండల్లాంటి బూడిదరంగు మేఘాలతో నిండిపోయింది. అప్పుడప్పుడు ఎక్కడో మేఘాల చాటునుండి అస్పష్టంగా ఉరుములు వినిపించ సాగాయి. సన్న సన్నగా చినుకులు రాలడం ప్రారంభమైంది.

బంగారయ్య ఆదుర్దా చెప్పనలవి కాదు. అడుగడుక్కీ వేగం హెచ్చించి నడవసాగాడు. అతని మనస్సు మనస్సులో లేదు. అతి త్వరగా ఆ అడవిని అతిక్రమించాలి. ఆ తర్వాత ఏదైనా సురక్షితమైన ప్రదేశం చేరుకోవాలి.

ఇంక కొద్ది సమయంలోనే కుంభ వృష్టితో కలిసి ప్రళయ గర్జనలతో భీకరాట్టహాసం చేయబోయే ఆ భయంకర నిశిలో-విలువైన సొమ్ము దగ్గరుండగా ఆ అడవి ధారిలో ప్రయాణం చేయడం ప్రమాదకరం.

ఎంతసేపు నడిచినా ఆ అడవికి అంతే లేదనిపి స్తోంది. గుబురైన చెట్లవల్లనేమో మరింత చీకటిగావుంది. దారి సరిగా కనిపించడంలేదు. మిట్ట పల్లాలు రాళ్లు రప్పలు అతని పాదాల్ని హూనం చేస్తున్నాయి. కాలుతీసి కాలు మోపుతున్నా డన్నమాటే గాని — ఆకు రాలిన చప్పుడుకు కూడా అతనిలో భయానుమానాలు కలుగక పోలేదు.

ఆకాశంలో మేఘాలు దట్టంగా ఆవరించి బరువుగా కదులుతున్నాయి. గాలి హోరు హెచ్చింది. చెట్లు నిలువునా కంపిస్తూ ఒక విధమైనటువంటి శబ్దాన్ని కలుగజేస్తున్నాయి. నల్లని ఆకాశాన్ని ఛర్రున చీల్చి పారవేస్తూన్నట్లు—వున్న ట్లుండి మెరుపులు.

రాను రాను వృక్షాల ఒత్తిడిదనం పలచబడసాగింది. అరణ్యం అంతమయ్యే సూచనలు కనిపించసాగాయి. బంగారయ్య మనస్సు కాస్త కుదుటపడింది. కాని-అతని భయం యింకా పూర్తిగా తగ్గిపోలేదు.

ఆ అడవి చివరన అడ్డు గోడలా ఒక ఎత్తైన కొండలబారు నిలబడివుంది.

గబగబ ఆనల్లనికొండల ప్రక్కగా నడిచిపోతు న్నాడు బంగారయ్య. ఉన్నట్టుండి ఎక్కడనుండో సన్న ఘ్రూలుగు వినిపించడంతో అతని గుండె''ఝల్లు''మన్నది.

ఒకసారి ఆగి చుట్టూ చూచి మళ్ళీ ముందుకు సాగాడు. ఈ పర్యాయం ఆ మూలుగు స్పష్టంగా దగ్గరగా వినిపించ సాగింది. ఈసారి ముందు కడుగు వేయలేకపోయాడు బంగారయ్య. చుట్టూ కలియజూచి, ఆ ఆర్తనాదం వినిపిస్తూన్న వైపుగా నడిచి ఒకచోట ఆగాడు. తన ప్రక్కనుండే వినిపిస్తోంది ఆమూలుగు. ఎవరూ అక్కడవున్న జాడలేదు. ఆ శబ్దం ఎలా వస్తోందో తెలియదు.

ఆ ప్రదేశమంతా పెద్ద పెద్ద కొండరాళ్ళతో నిండి వుంది. సన్నని వాన చినుకుల్లో తడిసి ఆ రాళ్ళు మరింత నలుపెక్కాయి.

ఆ పరిసరాలంతా వెదికాడు బంగారయ్య. చివరికి అతని శ్రమ ఫలించింది. అతను చూచిన దృశ్యం – అతన్ని ఆశ్చర్యంలో ముంచింది.

అతనికి కొన్ని అడుగుల ముందర చీకటిని నింపుకొన్న లోతైన గోయి ఒకటుంది. ఆ దీనాలాపం దానిలో నుండి వినిపిస్తున్నదే. ఎవరిదో - పురుష స్వరం బాధ బాధగా మూలుగుతోంది.

హఠాత్తుగా మెరిసిన మెరుపు కాంతిలో ఆ పాడుబడినబావి స్పష్టంగా కనిపించింది బంగారయ్యకు. రాతి

మయంగాను, లోతుగాను అగాధం లాగుంది. గోతి అంచులు నేలమట్టంగా వున్నాయి. లోపలికి దిగడానికి గాని, పైకిరావడానికి గాని ఎటువంటి మార్గమూ లేనట్టుంది.

బంగారయ్య మనస్సు బంగారం. సహజంగా అతనిది జాలి గుండె. కష్టాల్లో వున్నవారిని చూచి ఓర్వలేడు. పరులకు చేతనైన ఉపకారం చేయడమే అతని లక్ష్యం. బంగారయ్య ఆ అపరిచిత దీనుణ్ణి ఎలాగైనా రక్షించాలని నిశ్చయించుకున్నాడు. ఒక్క క్షణం - ఆలోచించాడు.

కొండ క్రింద పొడుగ్గా అల్లుకొని వ్యాపించివున్న ఒక రకమైన తీగెలు కనిపించా యతనికి. వెంటనే వాటి నన్నిటినీ పెకలించి ఒకదాని కొకటి పొడుగ్గా మెలిపెట్టి ఒక కొనను అగాధంలోకి విడిచాడు. రెండవకొనను బావి అంచున వున్న ఒక చిన్న చెట్టు బోదెకు కట్టాడు.

బావిలోకి మొహం పెట్టి—''లోపలికి తీగె విడిచాను. గట్టిగా పట్టుకో!'' అని కేక వేశాడు. మళ్ళీ రెండుసార్లు అదే విధంగా అరిచాడు. తీగెను లాగి చూశాడు. కాస్త బరువుగా వుంది. గోతిలోని వ్యక్తి తీగెను పట్టుకున్నాడని గ్రహించాడు బంగారయ్య. మెల్లగా తీగెను పైకిలాగడం మొదలెట్టాడు. తీగెతోబాటు వచ్చిన మానుషాకారాన్ని చేయూతనిచ్చి పైకి లాక్కున్నాడు. తీగె మళ్ళీ గోతిలోనికి జారిపోయింది.

మెరుపుల కాంతిలో ఆవ్యక్తిని బాగా పరిశీలించి చూశాడు బంగారయ్య. విలువైన ఉడుపులు ధరించివున్న పతను-నీరసంగా వున్నాడు. తాను రక్షించబడ్డానన్న సంతోషంతో అతని కళ్ళు మెరిసిపోతున్నాయి.

''మీరు చేసిన ఉపకారానికి సదా కృతజ్ఞుడిని. మన మిక్కడ నిలవడం అపాయకరం. త్వరగా వెళ్ళిపోదాం పదండి'' అన్నాడతను.

ఇద్దరూ త్వరత్వరగా కొంత దిగి-కొండప్రక్కగా వేగంగా నడవడం మొదలెట్టారు. క్రమంగా వర్షం అధిక మౌతోంది. ప్రకృతి భయంకర పరిణామాన్ని చెందుతోంది. దిక్కులు పిక్కటిల్లేటట్లు మేఘ గర్జనలు-ఆకాశం ముక్క ముక్కలై పోతుందేమో నన్నట్లు మెరుపులు-

ప్రళయమే ముంచుకొచ్చినట్లు పెద్ద గాలి వాన!

అనుకోకుండా ఎదురైన ఆ కుంభవృష్టిలో ఆ యిద్దరూ తడిసి ముద్దయిపోయారు. గాలి నాలుగుప్రక్కల నుండి వీస్తూ నూతన శక్తితో వాళ్ళను ఎండుటాకుల్లా వూగించేస్తోంది. అడుగు తీసి అడుగు వేయడం కూడా దుర్లభంగా వుంది వాళ్ళకు. దూర దూరంగా రాలుతోన్న పిడుగుల ధ్వనులు వాళ్ళ హృదయాంతరాళాల్లో ప్రతి ధ్వనిస్తున్నాయి.

నడిచింది కొంతదూరమే అయినా-ఆ గాలి వానకు తాళలేక బాగా అలిసిపోయారు. కాళ్ళల్లో నొప్పులు పుడుతున్నాయి. ఆ అయోమయ పరిస్థితిలో వాళ్ళ కాళ్ళు అప్రయత్నంగా ఒక పెద్ద కొండరాతివైపుకు మరలాయి. ఆరాతి వెనుకనైనా తల దాచుకుందామని వాళ్ళ ఉద్దేశ్యం అయివుండొచ్చు. కానీ - తీరా అక్కడికి చేరుకున్న తర్వాత అతి సమీపంలోనే చిన్న కొండ గుహ ఒకటి వాళ్ళ కంట బడింది.

వాళ్ళ సంతోషానికి మేరలేదు. అతి ఉత్సాహంగా గుహ దగ్గరికి పరుగు తీశారు. చీకటిని కూడా లెక్కచేయకుండా లోపలికి అడుగు పెట్టారు.

వర్షపు ధాటి తప్పింది. లోపల వెచ్చగా వుంది. నీరు ఏ వైపునుండీ లోనికి రావడానిక వీలులేదు. బయట ప్రళయం నివాసం ఏర్పరచుకొన్నట్లున్నా - గుహ లోపల మాత్రం ప్రశాంతంగానే వుంది.

ఇద్దరూ తడి బట్టలు పిండుకున్నారు.

"రెండు రోజులుగా ఆ అగాధంలోనే పడివున్నా, ఆకలికి, ప్రాణం పోయేటట్లుంది-" అన్నాడు దీనంగా ఆ అపరిచిత వ్యక్తి.

బంగారయ్యకు కడుపులో కలబెట్టినట్లయింది. వెం

టనే - తన అంగవస్త్రంలో ప్రయాణం కోసం కట్టివుంచిన జొన్న రొట్టెలను తీసి అతని ముందుంచాడు.

రొట్టెలు తడిసిపోయి వున్నా-ఆ వ్యక్తి అపాయ్యంగానూ, ఆతురతగాను తినసాగాడు. అతని ఆకలె లాంటిదోగాని - రొట్టెలన్నీ పూర్తయ్యేవరకు తగ్గిందికాదు. ఒక్కసారి తృప్తిగా త్రేన్చి బంగారయ్యవైపు చూచాడు. అతని విషయం అప్పటివరకుగాని ఆలోచించినవాడుకాదు.

"మరి నీవుతినలేదేమిటి?" అని అడిగాడు ఆశ్చర్యంతో.

"ఫరవాలేదులే బాబూ! నాకు ఆకలేయడం లేదు". అని -"మీరెవరో, ఎందుకా గోతిలో పడున్నారో చెప్పనే లేదు" అని అడిగాడు బంగారయ్య. అతను బాధగా నవ్వి యీ విధంగా చెప్పసాగాడు!

"నేనొక వర్తకుణ్ణి. విదేశాలలో వ్యాపారం చేసి బాగా డబ్బు గడించాను. చివరికి నా భార్యా బిడ్డలు జ్ఞాపకానికి వచ్చారు. వాళ్ళను చూడాలని కోరిక పుట్టింది. నా ధనాన్నంతా మూట గట్టుకుని స్వదేశానికి తిరిగి వస్తున్నాను. ఈ అరణ్యం మధ్య వెళ్ళుతూంటే-ఎక్కడినుంచో ఇద్దరు ముగ్గురు దొంగలు వూడిపడ్డారు. నా గుర్రాన్నడ్డగించి నామీద పడ్డారు. నాధనాన్నంతా దోచుకొని ఆరాళ్ళగోతిలో పడేశారు నన్ను. రెండు రోజులు అన్న పానీయాలు లేక

దాంట్లో నరకాన్ననుభవించాను. నా ఆయుర్దాయం గట్టిగా వున్నందువల్ల దేవుడు నన్ను రక్షించమని నిన్ను పంపి నట్లున్నాడు. నా ప్రాణాలు కాపాడినందుకు నే నేవిధంగా నీ ఋణం తీర్చుకోగలనో తెలియకుండా వుంది -''

బంగారయ్య ఆతని దురదృష్టాన్ని నిందించాడు. అతన్ని వోదార్చాడు. తనకు దారిలో తోడుగా మిత్రు డొకడు లభించినందుకు సంతోషించాడు.

వర్తకుని కోరికమీద అమాయకుడైన బంగారయ్య తన కథనంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. తాను ఎక్క డికి ఏ పనిమీద వెళ్తున్నదీ చెప్పాడు.

బయట వర్షధాటి తగ్గనేలేదు. వర్తకుడు నీరసం చేతనేమో - చలి మిక్కుటంగా వున్నా - గాఢ నిద్రలో మునిగిపోయాడు.

బంగారయ్యకు కంటిమీద కునుకు పడలేదు. చలి గుహలోపలికి దూసుకొస్తోంది. ఆకలేస్తోంది. మోకాళ్ళను దగ్గరికి చేర్చి రెండుచేతులతోను వాటేసుకుని కూర్చున్నాడు. చలి దేహంలోకి చొచ్చుకుపోతోంది.

కాలం గడిచిపోతోంది. కనురెప్పలు బరువుగా వాలి పోసాగాయి. బడలిక చేతనేమో - తనకు తెలియకుండానే చిన్న కునుకు తీశాడు బంగారయ్య.

# 3



సహజంగా మానవుడికి ఆశ అనే దుర్గుణం ఒక టుంటుంది. ఆ ఆశ విజృంభించి హద్దులు దాటిందంటే– మనిషికి కండ్లు రెండూ కనిపించవు. ఎంతటి దారుణానికైనా ఒడిగట్టేందుకు సిద్ధపడతాడు.

అంతవరకు నిద్రపోతున్నట్లు నటిస్తూవున్న వర్తకుడు కొంచెంగా కదిలాడు. బంగారయ్య వద్దనున్న వజ్రాన్ని కాజేయాలని తలచాడు. బంగారయ్య తనకు ప్రాణదాత అన్నమాట మరిచిపోయాడు. అతనిలోని మాన

వత్వం దగ్ధమైపోయింది. అతనిలోని ప్రతి అణువు విష పూరితమై పోయింది. ఇన్నిటికి కారణం ? – అతనిలో రేగిన దురాశయే!

వర్తకుడు చిన్నగా దగ్గాడు-తర్వాత గట్టిగా-ఇంకా గట్టిగా.....

నిద్రాదేవి ఒడిలో ఒళ్ళు మరచివున్న బంగారయ్య ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తప్ప గుహలో అంతా నిశ్శబ్దం.

వర్తకుడు మెల్లిగా లేచాడు. చీకట్లో బంగారయ్యను సమీపించాడు. అతని మొలలోవున్న వజ్రాన్ని బయటికి లాగాడు. ఒక్కసారి అతని కళ్ళు 'జిగేల్' మన్నవి.

చీమ చిటుక్కుమన్నా మేలుకునే బంగారయ్యకు ఎందుకో అప్పటివరకుగాని మెలకువ వచ్చింది కాదు. అతను కళ్ళు తెరవగానే–ఏదో చెయ్యి తన మొలలోని వజ్రాన్ని తీయడం గ్రహించాడు. ఆచేతిని గట్టిగా ఒడిసి పట్టుకున్నాడు.

అకస్మాత్తుగా జరిగిన యీ సంఘటనకు వర్తకుడు నిశ్చేష్టుడయ్యాడు. అతనికి ఏంచేయడానికి తోచిందికాదు. మనస్సు స్వాధీనంలో లేదు. చేతికి అందిన ఒక రాతిని పైకి తీసి బంగారయ్య తలమీద గట్టిగా కొట్టాడు. అంతే-

బంగారయ్య అతని చేతిని విడిచి బాధగా మూలిగి క్రిందికి ఒరిగిపోయాడు.

వర్తకుడు వజ్రాన్ని గుప్పిట్లో పట్టుకున్నాడు. గుహను దాటుకోబోతుండగా—బయటినుండి ఏదో అలికిడి వినిపించింది. గుహ ద్వారం దగ్గరే ఆగి చెవులు రిక్కించి వినసాగాడు.

బయట ఎవరో యిద్దరు వ్యక్తులు చిన్నగా మాట్లాడుకుంటున్నారు.

"గుహ లోపల ఎవరో ఉన్నట్లున్నారు."

"ఎందరు?"

"సరిగ్గా తెలియదు."

"ఏం చేస్తున్నారు?"

"బహుశా నిద్రపోతూ వుండవచ్చు"

అయితే ఆలస్యమెందుకు? వెంటనే వాళ్ళ పని కానిద్దాం. గుహ లోపలికి నడు" సంభాషణ ఆగిపోయింది.

వర్తకుడి గుండెల్లో రాయి పడ్డట్లయింది. ఇంకా సందేహమెందుకు? వాళ్ళు దొంగలే. గుహాద్వారం ప్రక్కన ఓ మూలగా ఒదిగి నిలుచున్నాడు వర్తకుడు.

ఆ ఇద్దరు దొంగలు గుహ ద్వారం దగ్గిరకొచ్చి ఒక్క క్షణం నిలబడి ప్రక్కలకు చూచి లోపలికి సాగి పోయారు.

చీకట్లో వర్తకుడు వారి కంటబడలేదు. వాళ్ళలా లోపలికి కదలగానే మెల్లగా బయటికి జారుకున్నాడు. ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా వేగంగా పరుగు తీశాడు. ఏకధాటిగా కురుస్తోంది వర్షం. ప్రకృతి భీభత్సంగా వుంది. గాఢాంధకారం వికటాట్టహాసం చేస్తోంది.

వర్తకుడు దారీ తెన్నూ లేకుండా కొండమీదుగా పరుగెత్త నారంభించాడు. దొంగలు తనను చూచి వుంటారా ? ఒకవేళ తనను అనుసరిస్తున్నారేమో!– ఈ విధమైనటువంటి అనుమానాలతో అతడు భయపడిపోయాడు. జీవితాశచేత గాలికన్నా వేగంగా పరుగెత్తసాగాడు.

ఆ చీకటిలో, వర్షపు హోరులో ఎవరో తనను వెనక నుండి బెదిరిస్తున్నట్లు, వెనక ఎవరో పరుగెత్తివస్తూన్నట్లు మాటి మాటికీ భ్రమిస్తున్నాడు.

అతడు పరుగిడుతూంటే–చిన్న చిన్న గులకరాళ్ళు క్రిందికి దొర్లుతున్నాయి. మాటిమాటికీ కాలుజారి పడుతూ– మళ్ళీ లేచి పరుగిడుతూ ఎంత దూరం వచ్చాడో, ఏవైపుగా వచ్చాడో కూడా తెలుసుకోలేక పోయాడు.

పూర్తిగా తడిసిపోయాడు. చలి కొరుక్కుతింటోంది. గాలి వెనక్కు నెట్టుతోంది. అతడు గాలిలో కొట్టుకు పోతున్నాడు. అతని పాదాలు గాయాలతో నిండి రక్తసిక్తమైనాయి. కాని వేగం తగ్గలేదు.

ఒక్కసారిగా భూమ్యాకాశాలు దద్దరిల్లాయి. ఆకాశం ఛర్రున చీలినట్లయింది. తల వెయ్యి వ్రక్కలై పోయేంత శబ్దంతో—ఫెళ ఫెళార్భాటంతో కొండ కొసలో పిడిగు పడింది.

ఆ పిడుగు పాటుకు పెద్ద పెద్ద బండరాళ్ళు తమ స్థానాల్లోనుండి తొలగి ఒక దాన్నొకటి తీవ్రంగా రాచుకుంటూ వాలుగావున్న వైపులకి దొర్లసాగాయి.

వర్తకుడు కొండవాలులో పరుగెడుతున్నాడు. ఆ వైపుకే దొర్లుతోంది ఒక బండరాయి. వర్తకుడు పరుగెడుతూనే వున్నాడు. బండ క్రిందికి దొర్లుకొస్తోంది. వర్తకుణ్ణే సమీపించింది. అతని మీదుగా దొర్లిపోయింది.

మరుక్షణంలో హృదయ విదారకమైన ఆర్తనాదం!

వర్తకుడి మృతకళేబరం ప్రక్కనేవున్న అగాధంలోకి దొర్లిపడింది.

ఆకాశం ఒక్కసారి వికృతంగా నవ్వింది.

# 3



బంగారయ్యకు స్పృహ కలిగింది. కళ్ళు తెరిచి చూశాడు. గుహలో మూలగా దేదీప్యమానంగా వెలుగు తోన్న కాగడా అతని కళ్ళను మిరుమిట్లు గొలిపింది. ఆశ్చర్యంతో పైకి లేవబోయాడు. సాధ్యపడలేదు. అతని రెండు చేతులు గట్టిగా వెనక్కు విరిచి కట్టబడి వున్నై. వెంటనే అతని ముఖం వివర్ణమై పోయింది.

వర్తకుడికోసం చుట్టూ కలయజూచాడు. అతనికి మారుగా యిద్దరు నూతన వ్యక్తులు నిలబడి వుండడం కని పించిం దతనికి. అంతా అగమ్యగోచరంగా వుంది.

వజ్రాన్ని లాక్కున్న వర్తకుడేమయ్యాడు? ఈ క్రొత్త మనుష్యులెవరు?—అతని బుర్రలో రకరకాల ఆలోచనలు చెలరేగుతున్నాయి.

చివరికి ధైర్యం చేసి "ఎవరు మీరు?" అని అడిగాడు.

వారిలో ఒకడు వికటాట్టహాసం చేశాడు. "మేమెవ రైందీ తెలుసుకోవాలా?" అంటూ బంగారయ్య దగ్గరికి వచ్చి అతను దాచుకున్న కొంత రొక్కాన్ని వెదికి తీసుకున్నాడు.

బంగారయ్య వెర్రిగా కట్లు తెంచుకోడానికి ప్రయత్నించాడు. అది గమనించిన దొంగ ఒక్క విషపు నవ్వు నవ్వి "మాచేతుల్లో చిక్కి ప్రాణాలతో తప్పించుకోలేవు—జాగ్రత్త!" అని గర్జించాడు.

బంగారయ్య వెర్రివాడిలా దిక్కులు చూడసాగాడు. అతని కళ్ళు చీకట్లు క్రమ్మినై.

తాను దొంగల చేతుల్లో చిక్కాడు-తనకు ఆయువు మూడింది-ప్రాణాలమీద ఆశవదులుకున్నాడు బంగారయ్య.

ఈరోజు తాను లేచిన వేళ మంచిది కాదేమో— లేకపోతే ఇన్ని అనర్థాలా? తనచేత రక్షింపబడిన వర్త

కుడు తననే మోసగించి వజ్రంతో పారిపోయాడు. మళ్ళీ స్పృహ రాగానే దొంగల మధ్య ఉన్నాడు తాను. వాళ్ళిక తనను ప్రాణాలతో విడువరు. తనకు చావు తప్పదు.

తానెంత బ్రతిమాలినా-ఆ కఠిన పాషాణాలు కరుగవు-కర్తవ్యం ఏమిటి యిక ?

అతననుకున్నట్లే జరిగింది. దొంగలిద్దరూ అతని ఈడ్చుకొని గుహ బయటికి నడిచారు.

వర్షం వెలిసింది. ఆకాశం తేటపడింది. దూర దూరంగా మసకగా నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నాయి. నేలంతా తడిగా వుంది. అక్కడక్కడా వర్షపు నీరు కాలువలు గట్టి పారుతోంది. చలి గాలి వీస్తోంది.

దొంగలు బంగారయ్యను కొండవాలులో గోతి దగ్గరికి బలవంతంగా నడిపించుకొని వెళ్ళారు. చీకట్లో వాళ్ళ ఆకారాలు మాత్రమే నల్లగ కనిపిస్తున్నాయి.

ముగ్గురూ అగాథం దగ్గరికి చేరుకున్నారు. బంగారయ్యను అందులోకి పడదోశారు దొంగలు. బంగారయ్య పెనుగులాడి ప్రయోజనం లేకపోయింది. కళ్ళు గట్టిగా మూసుకుని భయంగా కేకపెట్టాడు.

పాతాళంలోకి దిగజారి పోతున్నట్లనిపిస్తోంది. కళ్ళు తిరిగిపోతున్నాయి.

విద్యుద్ఘాతంలాగ అకస్మాత్తుగ కాళ్ళకు గట్టి దెబ్బ తగిలింది. బంగారయ్య కుప్పగా పడిపోయాడు గోతిలో. ఆ వూపుతో చేతికట్లు తెగిపోయాయి. శరీరానికి అక్కడక్కడ గాయాలు తగిలాయి.

ఏదో కొత్త లోకంలోకి వూడిపడ్డట్లుంది. క్రింద యిసుక పేరుకుని - తడిగా వుంది. నిండుగా ముండ్ల చెట్లు పెరిగివున్నాయి.

క్రిందినుంచి పైకిచూస్తే - ఆకాశం గిన్నెలా కనిపిస్తోంది. గ్రుడ్డి వెన్నెల గోతిలోకి చొచ్చుకు రాలేక పోతోంది.

చిన్నగ కదిలాడు బంగారయ్య. ఏదో గ్రుచ్చుకున్నట్లయింది. ఆవస్తువును చేతిలోకి తీసుకున్నాడు. అది మనిషి పుర్రె. హడలిపోయాడు. భయంగా అరిచి దాన్ని విసిరివేసి వెనక్కు పడిపోయాడు.

శరీరానికి ఏదో మెత్తగా తగిలింది. భయం భయంగా తడిమి చూచాడు. గుండె ఝల్లుమన్నది. విక్ర

తంగా అరిచి కండ్లు గట్టిగా మూసుకున్నాడు. గుండె దడ దడ కొట్టుకుంటోంది. ఒళ్ళంతా వణుకు పుట్టింది.

అతనికి మెత్తగ తగిలింది-ఒక మనిషి శవం! ఒక మూలగ ఒదిగి ముడుచుకున్నాడు. అతని భయం చెప్ప తరంకాదు. ఆగోతిలో – శరీరాన్ని చీరేస్తున్న ముండ్ల పొదలు, పుర్రెలు వికలమైపోయినఅస్థిపంజరాలు, ప్రక్కనే వున్న మృత కళేబరం—వీటి మధ్య ఎటువంటి ధైర్యవంతుడైనా గుండె ధైర్యం కోల్పోక మానడు.

గోతిలోని చెమ్మకు ఒళ్లు గగుర్పొడుస్తోంది.

ఎప్పుడు తెల్లవారుతుంది ?....

ఎలా ఆ గోతిలోనుండి బయట పడేది ?......ఇదే ధ్యాసలో వున్నాడు బంగారయ్య.

ఉన్నట్లుండి అతని దృష్టి ఒక వస్తువుమీదికి కేంద్రీకరింపబడింది—ఒక మూలగా వర్షపు నీరు నిలిచివుంది. దానిలో—అప్పుడప్పుడే తేటబడుతోన్న ఆకాశం ప్రతిబింబిస్తోంది. ఆ నీటి అంచులో ఒకచోట—ఏదో వస్తువు వింతగ మెరుస్తోంది. దానికాంతి పాలపొంగులా స్వచ్ఛంగా వుంది.

బంగారయ్య-దానినే దీక్షగా చూచాడు. జంకుతూనే ఆ వస్తువును చేతిలోకి తీసుకున్నాడు. అటు యిటు త్రిప్పి చూశాడు. అతని ఆశ్చర్యాని కంతులేదు. అతని ఆనందానికి హద్దుల్లేవు.

అది తన వజ్రమే. నిస్సందేహంగా తనదే!....

ఆ ఆనందంలో అతని భయం ఎలా పోయిందో తెలియదు.

తన వజ్రం యిక్కడికెలా వచ్చింది ?...

ఆ వర్తకుడేమయ్యాడు ?....

తాను చూచి భయపడిన ఆశవం ఎవరిది? ఇటువంటి ప్రశ్నలు, అనుమానాలు చెలరేగాయి—అతనిలో.

శవాన్ని పరిశీలించి చూడాలనుకున్నాడు. కానీ ధైర్యం చాలలేదు.

వజ్రాన్ని దాచుకున్నాడు. అలాగే కూర్చుని సూర్యోదయం కోసం ఎదురుచూడ సాగాడు.

క్రమంగా రాత్రి అంతరిస్తోంది. ఆకాశంలో పలుచని వెలుగు తెరలు దోబూచులాడుతున్నవి. ఇంక కొద్దిసేపట్లోనే తెలతెలవారబోతోంది.

బంగారయ్యకు క్షణాలు యుగాల్లా గడుస్తున్నాయి. సూదులమీద నిలబడినట్లుంది అతని స్థితి. సూర్యోదయం కోసం తహ తహ లాడిపోతున్నాడు.

క్రమంగా ఆవరిస్తోన్న గ్రుడ్డి వెలుతురులో గోతి లోకి వ్రేలాడుతూన్న పొడవైన తీగ బంగారయ్యా కంట బడింది. ఒక్కసారి ఎగిరి గంతేశాడు. అతనిలో సంతోషం ఉరకలు వేస్తోంది. ఆతీగను వర్తకుణ్ణి రక్షించేందుకు విడిచాడు తాను. ఇప్పు డది తన ప్రాణాలను రక్షించుకో వానికి ఉపకరించింది.

ఆ ఆనందమయ వాతావరణంలో రాత్రి గడిచి పోయింది. తెల్లవారింది. ఇంకా సూర్యోదయం కాకపో యినా వెలుగు రేఖలు వెల్లివిరుస్తున్నై.

గోతిలోకి వెలుగు బాగా ప్రసరిస్తోంది. బంగా రయ్యా లేచి ఆ శవాన్ని ప్రక్కకు కదిలించి చూశాడు. ఒక్క క్షణం నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

ఆ శవం వర్తకుడిదే! బాగా చితికిపోయి వుంది.

బంగారయ్యకు ఏదో మాయలాగా వుంది. వర్త కుడు ఆ గోతిలో ఎందుకు చచ్చి పడున్నట్లు?—ఎంత ఆలోచించినా తగిన సమాధానం దొరికింది కాదు. అతని యీ ప్రశ్న ప్రశ్నగానే వుండిపోయింది.

ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చి తీగనందుకున్నాడు. లాగి చూచాడు. గట్టిగానే వుంది. తీగనుపట్టుకుని మెల్లగా పైకి ప్రాకిపోయాడు.

పైకి వెళ్ళి సంతోషంతో ఊపిరి పీల్చుకున్నాడు. దొంగలకు సందేహం కలగకుండా వుండడానికి తీగను విప్పి అవతల పారేశాడు. కొంత దిగి వేగంగా నడక నందుకున్నాడు.

సూర్యోదయం ఆహ్లాదకరంగా వుంది. కమ్మని వాయువులు వీస్తున్నాయి. చెట్లపైనుండి పక్షులు కలగానాలు ఆలపిస్తున్నాయి. ఉదయ కిరణాలలో పచ్చిక మొనలపైని మంచు బిందువులు ముత్యాల్లా మిలమిల లాడుతున్నాయి.

బాలభానుని లేత కిరణాలు చురుకెక్కే లోపున రాజధానీ నగరపు సరిహద్దుల్లోకి చేరుకున్నాడు బంగారయ్య. సంతృప్తిగా, సంతోషంగా ఒక్క శ్వాస తీసుకొన్నాడు.

అనుకోకుండా వెనుదిరిగి చూచాడు. దూర దూరంగా-అడవి చెట్ల మధ్య-తనను చూచి నవ్వుతూన్నట్లుంది కొండల బారు.

గతరాత్రి అనుభవాలు అతని హృదయంలో గాఢంగా నాటుకుపోయాయి.

ఉన్నట్లుండి నవ్వాడు చిన్నగా - నిర్జీవంగా వుంది ఆ నవ్వు.

వేదాంతిలా మెల్లగా అన్నాడు: "కృతఘ్నుడు ఏనాటికీ బాగుపడడు...."

అస్పష్టంగా వెలువడిన యీ మాటలను - మంద వాయువులు - ప్రపంచానికి ఒక ఘన సందేశాన్నివ్వడానికన్నట్లు ఎక్కడికో మోసుకువెళ్ళాయి.